# శకుంతల-పెసరట్లు

పవన శర్మ




శేషగిరికి కబుర్లంటే బోల్డిష్టం. చలాని క్కూడా కబుర్లంటే అంతే ఇష్టం. కాని శేష గిరికి చలం చెప్పే కబుర్లంటే ఇష్టంలేదు. ముఖ్యంగా శకుంతలతో చెప్పే కబుర్లంటే ఇష్టం లేదు. అంటే తను శకుంతలతో చెప్పేవి కావు. చలం శకుంతలతో చెప్పేవి. శేషగిరికి శకుంతలతో కబుర్లు చెప్పటం ఇష్టం. మేడమీద చంద్రోదయ సమయంలో శకుంతల కళ్లల్లోకి చూస్తూ చెప్పడం మరీ యిష్టం. అల్లాంటప్పుడు, ఎంత అయిదోక్లాసునుంచి కలిసి చదువుకొన్నా, చలం దూసుకుని పైకివచ్చి కబుర్లలో చొరపడటం ఇష్టంఉండదు. కాని శకుంతలమాత్రం ''రండి అన్నయ్యగారూ'' అంటూ ఆహ్వానిస్తుంది. ఈ మధ్య చలం మరీ బరితెగించాడు. అతని పెళ్లాం కనకమహాలక్ష్మి పురిటికి పుట్టింటికి వెళ్లింది. పెళ్లాం ఊళ్లో ఉండగా అంత బరితెగించేవాడు కాదు. శేషగిరి పగతీర్చుకోవచ్చన్న భయం ఉండేది. కాని ఇప్పుడు కనకమహాలక్ష్మి పుట్టింట్లో ఉంది. మూడు నాలుగు నెలల్దాకా రాదు. అదీ ధైర్యం!

''చూడమ్మా! శకుంతలా! రేపాదివారం పొద్దున్న ఏం టిఫిన్ చేసుకొంటున్నారు?'' అని మొదలు పెడ్తాడు.

''ఇంకా ఏమనుకోలేదు అన్నయ్యగారూ! ఏం చెయ్యమంటారు?'' అని శకుంతల ఆపేక్షగా అడుగుతుంది.

''ఇడ్లీలు చెయ్యి. కొంచెం కొబ్బరి పచ్చడి, నీళ్లు తక్కువపోసి చెయ్యి. పోపులో ఒక్కటేఒక్క మెరపకాయ వెయ్యి. ఇంట్లో మజ్జిగచేసి తీసిన వెన్నకరగబెట్టి నెయ్యిచేస్తే ఇడ్లీల్లోకి ఉంటుంది'' అని నిర్మొహమాటంగా చెప్తాడు.

''వద్దు పెసరట్లు చెయ్యి'' అంటూ శేష గిరి అడ్డు పడితే, ''పెసరట్లలో కారం ఎక్కువ పడ్తుంది, నూనెక్కువపడ్తుంది వంటికి మంచిది కాదు ఇడ్లీలు ఎన్నితిన్నా వంటికి చెరుపులేదు. అదే పెసరట్లయితే అజీర్తి, కడుపునొప్పి. నీకు వయస్సొస్తోంది కాని శేషుడూ! బుద్ధి పెరగటం లేదురా'' అంటాడు.

''వారం అంతా మీక్కావాల్సినవి చేస్తూనే ఉన్నాను కదా ఆదివారం ఒక్కరోజు అన్నయ్యగారికి కావాల్సినవి చేస్తేపోలా'' అంటుంది శకుంతల.

''ఏం చేస్తున్నావ్? నువ్వేం చేస్తున్నావో నేనేం తింటున్నానో కూడా గమనించకుండా తిని వెళ్లిపోతాను. ఆదివారం కాస్త తీరుబడిగా పెస రట్లు వేయించుకొని ఉప్మాలో తిందామనుకొం టుంటే, మధ్య వీడి ఇడ్లీల గోలొకటి''

''తప్పండి. మీ చెల్లెలు ఊళ్లో లేనప్పుడే కదా ఆయన ఎనింటికివచ్చేది. మీరల్లా మాట్లాడ కూడదు'' అని శకుంతల లాలిస్తుంది.

''అవున్నా శేషుడు. నువ్వు పవిత్ర భారత దేశంలో పుట్టి అతిథిపట్ల అంత అగౌరవంగా మాట్లాడకూడదు. పూర్వం, వాళ్లకున్నా లేకున్నా అతిథికిపెట్టి తరించేవారు మన పూర్వీకులు. నేను, నిన్నుకూడా నాతోపాటు ఇడ్లీలుతిని నాలాగా ఆరో గ్యంగా అందంగా ఉండమంటున్నాను కాని నిన్ను మానుకొని నాకు పెట్టమనడంలేదుగా.

# శకుంతల పేకాట

శేషగిరి పెద్ద రిస్కు తీసుకొన్నాడు. వచ్చిన వాడు చలం అన్న ఉద్దేశంతో పేక తీసాడు. అల్లా కాకుండా కిందున్న తల్లితో పనున్న ఎవరైనావచ్చి ఉంటే తను తిరికూర్చుని శకుంతలతో పేకాడే చిక్కులో పడ్డాడన్నమాటే! శకుంతలకి పైగా చిన్న ఆటలు నచ్చవు, మెదడుకి మేత పెట్టవి తప్పించి. ఆటనావిధంగా ఎనుకొన్నాకె, మెదడుని కూరలో ఉప్పేసానా లేదా చాకలివాడికి పావలా ఎక్కువిచ్చానా? లాంటి విషయాలమీదికి కళ్ళాలు వదిలేసి పరిగెత్తనిస్తుంది అప్పుడు. శేషగిరి "నా బుద్ధి గడ్డితిని వీతో ఆడుతున్నాను" అనుకొంటాడు. అనడు.

వచ్చినవాడు చలమే! అమ్మయ్య. "రారా! చలపతీ మీ చెల్లాయి కివాళ బుద్ధి పేకమీదకు పోయింది" అంటూ ఆప్యాయంగా శేషగిరి ఆహ్వానించాడు. శేషగిరి ఆప్యాయత చూస్తే చలానికి అనుమానం కలిగింది.

"ఇవాళ పేకాట ఆడే మూడ్ లేదురా. నీ డొక్కుకార్లో అలా బజారు కేసి వెళ్దాం. అక్కడ చొక్కాలు, లాగూలు, చీరలు అన్నీ చవగ్గా అమ్ముతున్నారట" అన్నాడు జాగ్రత్తపడూ.

"ఇవాళ ఎంచక్కా ఓ గంట పేకాడుకొందాం అన్నయ్యగారు ఆపైన బజారుకెళ్దాం" అంటూ శకుంతల రాజీమార్గం సూచించింది.

చలానికి తప్పలేదు. కూర్చున్నాడు "కట్ త్రోట్ బ్రిడ్జ్ ఆడ్దామా శకుంతలా?!" అనడిగాడు శేషగిరి. శేషగిరి మొహంలో ఎక్కడా చలాన్ని ఉచ్చులో బిగించబోయే వేటగాడి లక్షణాలు లేవు. శకుంతలతో పేకాడటమే తన జీవిత ధ్యేయంగా పెట్టుకొన్న ఆదర్శపురుషుడి లక్షణాలు మాత్రం కొట్టవచ్చినట్టు కన్పిస్తున్నాయి. శకుంతల ఉత్సాహంగా తలాడించింది.

మొదటి ఆటలో శేషగిరి శకుంతల ఒకటయ్యారు. చలం బిడ్ నెగ్గి డమ్మీ కార్డ్సు తీసుకొన్నాడు. శకుంతల బజార్లో ఏ షాపులో రిడక్షన్ సేలుందో చలాన్ని అరాతీస్తూ ఛడామడా ముక్కలు వేసింది అంట ఆసులమీద తన రాజులు వేసింది. శేషగిరి పట్లను తను కోసింది. చలం గెలవటమే కాకుండా ఓవర్ ట్రిక్కులు చేశాడు. శేషగిరి కోపం నటించాడు అతనికి నిజానికి కోపంరాలేదు. తను బిడ్ నెగ్గినప్పుడు, శకుంతల చలం పార్ట్నర్ అయి, అప్పుడిల్లాగే ఆడ్తే తను అనుకొన్నది సాధించగలడు. "ఒరేయి శేషుడూ! నీకు కోపం ఓపిసరు ఎక్కువరా!" అన్నాడు చలం. శేషగిరి ఒప్పుకొన్నాడు

సత్యమేవజయతే! అంతిమవిజయంఎప్పుడూ ధర్మానిదే. ఆ తరువాత రెండాటల్లోను, శేషగిరి డమ్మీ ఒకవైపు చలం శకుంతల ఒకటయ్యారు మొదటాటలో శకుంతల ఎన్నివిధాలుగా తప్పాడటానికి వీలుందో అన్ని విధాలుగాను ఆడింది

"చెల్లెమ్మా! నీ మనస్సు పేకాటమీదలేదు" అన్నాడు విసుగు దాచుకుంటూ చలం.

"అవునన్నయ్యగారూ! ఏడాది బట్టి ఓ స్కూలుకుర్రాడు మా యింటికివచ్చి తను బీదవాడినని జీతం కట్టడానికి డబ్బుల్లేవని చెప్తూ రెండు మూడు తీసుకువెళ్తున్నాడు. ఇవాళ పబ్లిక్‌పరీక్షకి ఫీజు కట్టాలంటూ వచ్చాడు. నువ్వు ఏ స్కూల్లో చదువుతున్నావో చెప్పు నేను వెళ్ళికడ్తాను అన్నాను. వాడు మీకెందుకు శ్రమ అన్నా నేను వినలేదు. ఆఖరికి చెప్పాడు. నేనే మోస్కూలుకికదా వెళ్ళేదిఅని కొంచెం సాధారణంగా తయారై వెళ్ళాను. నేను మామూలుగా చాలా సింపుల్‌గా ఉంటాను కదా. ఇవాళ ఇంకా సింపుల్‌గా తయారై వెళ్ళాను ఎర్రంచు తెల్లచీర మీదకి ఎర్ర బ్లౌజ్ కాకుండా తెల్లది వేసుకువెళ్ళాను వెళ్ళి ఆ అబ్బాయి ఎల్లా చదువుతున్నాడని క్లాసులో ఎలా ఉంటాడనీ అడిగాను. దానికి క్లాసు టీచర్ "వాడు మీ అబ్బాయా! వెధవ క్లాసులకి సరిగ్గా రాడు. ఇవాళకూడా రాలేదు మీరు ఇంటిదగ్గర పరీక్ష జీతం కట్టమని ఇచ్చిన డబ్బులో సినిమాలు చూసాడు కాబోలు కట్టలేదు. క్లాసులు మానేసి అక్కడా ఇక్కడా తను బీద విద్యార్థినని చెప్పి ముష్టెత్తి డబ్బు సంపాదించి కడ్తాడు కాబోలు. వాడు ప్రతినెలా జీతం అల్లాగే కడ్తాడని మిగిలినపిల్లలుచెప్తారు" అన్నారు. "ఏమండి అన్నయ్యగార్లు నేను ఆ ముష్టివెధవ తల్లిలాగా ఉన్నానా? నాకంత పెద్దకొడుకుంటాడని ఆ మేష్టరెల్లా అనుకొన్నాడు" అంటూ శకుంతలబాధ పడిరెండోఆట సరిగ్గా ఆడ్తానని వాగ్దానం చేసింది

తరువాత ఆటలో డమ్మీలో ఆసు, రాణి ఉంటే జాకీ ఆడింది. శేషగిరి రాణివేసిపట్టి ఆసుఆడాడు శకుంతల రాజు వేసింది. చలానికి కోపం వచ్చింది చలంమొహంలో మారుతున్న రంగుల్ని చూసి శేషగిరి సంతోషించాడు. "జాకీ ఎందుకు దిగినట్టు?" అని అడిగాడు. "ఆయన ఆసువేసి పడ్తారనుకొన్నాను" అంది శకుంతల. చలానికింత చిన్న లాజిక్ అర్థం కాలేదా అని ఆశ్చర్యపోయింది. చలానికి బుర్ర తిరిగిపోయింది. "చెల్లెమ్మా! నువ్వు పేకజోలికి పోకు నేను రేపట్నుంచి క్లబ్బులోనే ఆడుకొంటాను" అన్నాడు సెలవు తీసుకొంటూ

ఆ తరువాత చలం పెద్దగా రాలేదు. వచ్చినా శకుంతల పెసరట్లే పెట్టింది. "ఎంత అన్నయ్య అయితేమాత్రం తనకి పేకాట రాదంటాడా?" అన్నకోపంతో

